487) బౌళి

ప॥ హితవే సేసుగా కాతడేల మానును। మితి నాతని దూరక మెచ్చవలెగాక॥

చ॥ ఆగమభోగములకు హరి నాలో నున్నవాడు। చేగదీర నాకు మేలే చింతించుగాక।
సాగినప్రపంచములో సంసారి జేసినవాడు। యేగతి రక్షించ దానే ఇన్నిటి కౌగాక॥

చ॥ భూమిమీద దేహమిచ్చి పుట్టించినట్టివాడు। ప్రేమతో నన్నపానాలు పెట్టుగాక।
ఆమని పంచేంద్రియాల నటు పెడరేచేవాడు। నేమపుబుత్రదారలై నిండుకుండుగాక॥

చ॥ ఇహపరములకు దా నిరవైనట్టివాడు। సహజాన నన్నియును జరపుగాక।
వహి శ్రీవేంకటాద్రిపై వరములిచ్చేటివాడు। మహిమతో మమ్మునేలి మన్నించుగాక॥